ప్రజాశక్తి

సోమవారం 4 ఆగస్టు 2025 5 అనంతపురం






సమావేశంలో మాట్లాడుతున్న జెవివి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గేయానంద్

# నిర్లక్ష్యం ఖరీదు... నిండు ప్రాణం

**నిర్లక్ష్యం నిండు ప్రాణాన్ని బలికొంది. ఇద్దరు బిడ్డలకు తల్లిని దూరం చేసింది. దంపతుల అమాయకత్వం, అవగాహన లేమి, అన్నీ తెలిసిన అధికారులు, కాసులకు కక్కుర్తి పడిన వైద్యుల నిర్లక్ష్యం ఒక నిండు గర్భిణిని బలికొంది. వైద్య శాఖ అధికారులు మాత్రం ఇప్పటికే ఆసుపత్రిని వేర్వేరు పేర్ల మీద రెండుసార్లు సీజ్ చేశామని, ప్రస్తుతం శ్రీకృప పేరు మీద అనుమతులు కోరినా ఇవ్వలేదని దాటవేత ధోరణితో వ్యవహరిస్తున్నారు.**

**ప్రజాశక్తి - అనంతపురం**



మృతురాలి కూతురు, కుమారుడు

## అనంతలో అబార్షన్ వికటించి గర్భిణి మృతి

## కాసులకు కక్కుర్తి పడిన వైద్యుడు

## అనుమతులు లేకున్నా ఆపరేషన్‌కు ఒప్పుకున్న వైనం

## ఆపరేషన్ థియేటర్ లోనే ప్రాణాలు వదిలిన మహిళ

## ఆందోళనకు దిగిన మృతురాలి బంధువులు

అనంతపురం నగరంలోని రామచంద్రనగర్‌లో శ్రీకృప మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని డాక్టర్ బి.రమణ నాయక్ నిర్వహిస్తున్నారు. గత మూడు నెలలుగా అనుమతుల కోసం జిల్లా వైద్యశాఖకు దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఇప్పటికే బ్లాక్‌లిస్టులో ఉన్న ఆసుపత్రి కావడంతో అధికారులు అనుమతులు ఇవ్వలేదు. అయితే కొంతమంది వైద్య శాఖ అధికారుల సలహాతో ఆ వైద్యుడు ఆసుపత్రికి అనుమతులు లేకుండా నడుపుతున్నారు. ఈ క్రమంలో శుక్రవారం బుక్కరాయసముద్రం మండలం చెదల్ల గ్రామానికి చెందిన మల్లికార్జున అతని భార్య ఐదునెలల గర్భిణి రాధిక అబార్షన్ నిమిత్తం ఆశా వర్కర్ల సహాయంతో వైద్యుడిని సంప్రదించారు. వీరు అప్పటికే పలుచోట్ల ప్రయత్నం చేసినా అబార్షన్‌కు ఒప్పుకొని పరిస్థితి ఉండడంతో డాక్టర్ రమణ నాయక్ ను సంప్రదించారు. ఇప్పటికే ఆ దంపతులకు ఐదు సంవత్సరాల పాప అమల, రెండు సంవత్సరాల బాలుడు మోహన్ సాయి ఉన్నారు. కాగా మూడవ బిడ్డను వద్దని అబార్షన్ చేయడం కోసం వైద్యులను శుక్రవారం ఆశ్రయించారు.



మృతురాలు రాధిక

కాసులకు కక్కుర్తి పడిన వైద్యులు ఆదివారం నాడు డబ్బులు సిద్ధం చేసుకోవాలని అబార్షన్ చేస్తామని సూచించారు. అనుకున్న రీతిలో ఆదివారం రాధికా దంపతులు శ్రీకృప ఆసుపత్రికి చేరుకున్నారు. అబార్షన్‌కు సిద్ధం చేసిన వైద్యులు ఆపరేషన్ థియేటర్‌కు రాధికను తీసుకువెళ్లారు. అయితే ఆపరేషన్ థియేటర్లో అబార్షన్ చేస్తున్న సమయంలో వైద్యం వికటించి రాధిక అక్కడికక్కడే మృతి చెందింది.రాధిక మృతి చెందడంతో పెద్ద ఎత్తున మృతురాలి కుటుంబ సభ్యులు బంధువులు ఆసుపత్రి బయట ఆందోళనకు దిగారు. వైద్యుడి నిర్లక్ష్యం కారణంగా మహిళ మృతి చెందిందని సంబంధిత కుటుంబీకులు ఆసుపత్రిపై దాడి చేశారు.

**నిబంధనలకు తిలోదకాలు :** ఆసుపత్రికి అనుమతులు లేకున్నా డాక్టర్ రమణ నాయక్ వైద్యం చేసేందుకు ఒప్పుకోగా మరోవైపు అనస్తీసియాను అదే ఆసుపత్రిలో ఉన్న డెంటల్ వైద్యురాలు లావణ్య ఇవ్వడం పూర్తిగా నిబంధనలకు విరుద్ధంగా జరిగిందన్నది వాస్తవం. కాగా ఇప్పటికే ఆ ఆసుపత్రిలో రెండు పర్యాయాలు ఇలాంటి సంఘటనలు జరిగినా, జిల్లా వైద్యశాఖ అధికారులు అనుమతులు లేకున్నా పట్టించుకోని పరిస్థితి పట్ల పౌరసంఘాలు అభ్యంతరం వ్యక్తపరుస్తున్నాయి. జిల్లా వైద్యశాఖ అధికారుల సైతం అనుమతులు లేకుండా ఆస్పత్రి నిర్వహించడం తెలియకపోవడంపై పలు రకాల విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అధికారుల అండదండలు లేకుంటే ఆసుపత్రిని ఎలా నిర్వహిస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఆసుపత్రికి అనుమతులు లేకుండా వైద్యశాఖ, వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించిన తీరు పట్ల తీవ్రమైన ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. మూడవ పట్టణ సిఐ శాంతిలాల్ ఆధ్వర్యంలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఆసుపత్రి వద్ద ఆందోళన చేస్తున్న మృతురాలి బంధువులు, కుటుంబసభ్యులు

### అధిక రక్తస్రావం వల్లే..

అబార్షన్ కోసం తమను ఆశ్రయించారు. అయితే అప్పటికే పలుచోట్ల ఇతర మందులు వాడడం వల్ల అంతర్గతంగా పలు సమస్యలు చోటుచేసుకున్నాయి. అబార్షన్ చేసే సమయంలో రక్తస్రావం నియంత్రించేందుకు ఎంత ప్రయత్నించినా ప్రయోజనం లేకుండా పోయింది.

**డాక్టర్ రమణ నాయక్,**
**శ్రీకృప ఆసుపత్రి వైద్యులు**
**అనంతపురం**

### చట్టపరంగా చర్యలు

ఆసుపత్రికి అనుమతులు లేనిది వాస్తవం. చట్టపరంగా అనుమతులు లేకుండా చికిత్స చేయకూడదు. ఆపరేషన్ చేయడంతో గర్భిణి మృతి చెందిందని ఫిర్యాదు అందింది. క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆసుపత్రిని సీజ్ చేశాం. ఆసుపత్రి యాజమాన్యంపై తగిన చర్యలు తీసుకుంటాం.

**అనుపమ జేమ్స్,**
**ఇన్‌ఛార్జి డిఎంహెచ్ఒ**

# శాస్త్రీయపరమైన ఆలోచనే సైన్స్

## జెవివి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎం.గేయానంద్

**ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్**

శాస్త్రీయపరమైన ఆలోచనే సైన్స్ అని, ప్రశ్నించడం రుజువులు అడగడం సైన్స్ తత్వమని జెవివి రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఎం.గేయానంద్ అన్నారు. జన విజ్ఞాన వేదిక 18వ నగర మహాసభ స్థానిక న్యూటౌన్ జూనియర్ కాలేజ్‌లోని మీటింగ్ హాల్‌లో ఆదివారం జరిగింది.నగర గౌరవాధ్యక్షులు ఎస్.గాంగే నాయక్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన గేయానంద్ మాట్లాడుతూ సైన్స్ ఎప్పుడు మనం ఆలోచించే విధానంలో మార్పు తీసుకొస్తుందని రుజువులు లేకుండా ఇతరులు చెప్పేదాన్ని నమ్మవద్దని చెబుతుందని అన్నారు. సమాజంలోని అశాస్త్రీయ ప్రచారాన్ని నమ్మదని అలాంటి వాటితో విభేదిస్తుందని అన్నారు. జనవిజ్ఞాన వేదికలో పనిచేయడం అంటే మన ఆలోచనలో సరైన మార్పురావడమే అని అలాంటి మార్పు రాగలిగిన వారు మాత్రమే ఇందులో పని చేయగలరని చెప్పారు. సైన్సు తెలియడం వేరు ఆచరించడం వేరని ఆచరించినప్పుడే దాని ఫలితం కనిపిస్తుందని మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు ఎ. చంద్రశేఖర్ అన్నారు. నగర మహాసభలో 'సమకాలిన పరిస్థితుల్లో సైన్స్ ఎదుర్కొంటున్న సవాళ్లు' అనే అంశంపై ఆయన మాట్లాడుతూ గొప్ప గొప్ప శాస్త్రవేత్తలందరు మానవాళి అభివృద్ధికై ఎన్నో రకాలైన ప్రయోగాలు చేస్తున్నారని అయినప్పటికీ వారి కృషికి తగ్గ ఫలితం గానీ సహకారం ఉండడం లేదని అన్నారు. ప్రపంచంలో ఏ దేశం అభివృద్ధి చెందాలన్నా సైన్సును సరైన పద్ధతిలో ఉపయోగించడం తప్ప మరో మార్గం లేదని చెప్పారు. సైన్స్ నిర్లక్ష్యం చేసిన దేశాలు అభివృద్ధి చెందవని ప్రస్తుతం మన దేశంలో అలాంటి పరిస్థితి కనిపిస్తుందని అభిప్రాయపడ్డారు. సైన్స్ ఉపయోగించుకుని చిన్న చిన్న దేశాలు ఎంతో అభివృద్ధి చెందాయని వాటితో మనం పోటీ పడలేకపోవడం మనకున్న ఆలోచన విధానంలో మార్పు రాక పోవడమేనని అన్నారు. సైన్స్ ఒక అడుగు ముందుకేస్తే దాన్ని వ్యతిరేకించే వాళ్ళు మాత్రం నాలుగు ఆడుగులు ముందుకు వేస్తారని దాన్ని తట్టుకొని నిలబడగలగాలంటే చాలా పటిష్టంగా పనిచేయవలసి ఉంటుందని జెవివి రాష్ట్ర గౌరవ అధ్యక్షులు రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. శాస్త్రీయ దృక్పథాన్ని ఆచరించి అన్వయించుకున్నప్పుడు మాత్రమే అది సాధ్యమవుతుందని అటువంటి ప్రయత్నం జరగాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జెవివి రాష్ట్ర అడిట్ కమిటీ కన్వీనర్ సాకే భాస్కర్, జిల్లా కార్యదర్శి కెంచా లక్ష్మీనారాయణ, జిల్లా కోశాధికారి మహమ్మద్ జిలాన్, జిల్లా నాయకులు యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి, లింగమయ్య నాయకులు రమణయ్య, సమత జిల్లా కన్వీనర్ డాక్టర్ పి.ప్రసూన,సమత నాయకులు నాగరత్నమ్మ, శశికళ, లలిత లక్ష్మి, జెవివి నాయకులు రామిరెడ్డి, వీరరాజు, ప్రసాద్ రెడ్డి, తిరుపాలు, అర్జున్ నాయక్, గోపాల్ నాయక్, ప్రసాద్, లక్ష్మీనారాయణ, రాఘవేంద్ర, బాబ్జాన్ షాజహాన్ తదితరులు పాల్గొన్నారు.

## 'జీడిపల్లి' పరివాహక ప్రాంతాల్లో అప్రమత్తత అవసరం

**ప్రజాశక్తి-బెళుగుప్ప**

జీడిపల్లి రిజర్వాయర్‌కు కృష్ణాజలాలు చేరుకున్న నేపథ్యంలో పరీవాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ అనిల్‌కుమార్ సూచించారు. ఈమేరకు రిజర్వాయర్ వద్ద నీటి ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాల్యాల రాగులపాడు పంప్‌హౌస్ నుంచి మండల పరిధిలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు కృష్ణాజాలాలు చేరుతున్నాయన్నారు. కావున ఆయా గ్రామ ప్రజలు, చిన్నారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే రిజర్వాయర్ గేట్లు దగ్గర వద్ద, రిజర్వాయర్‌లోగానీ ఈత కొట్టడానికి, చేపలు పట్టేవారికి వెళ్లకూడదన్నారు. ఇకపోతే జీడిపల్లి రామసాగరంలో నివాసంలో ఉండే ఇళ్ల వద్దకు రిజర్వాయర్ నీరు వచ్చినా.. ఏదైనా అవాంఛనీయ ఘటన జరిగినా వెంటనే గ్రామ రెవెన్యూ అధికారికిగానీ, తనకుగానీ సమాచారం అందించాలని తెలిపారు.





అప్రమత్తత బోర్డు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

## స్టిక్కరింగ్ వాహనాలపై ప్రత్యేక నిఘా

### ఎస్ఐ సాగర్

**ప్రజాశక్తి - నార్పల**

మండల వ్యాప్తంగా ప్రెస్, పోలీస్ స్టిక్కర్లు ఉన్న వాహనాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ సాగర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే కొందరు తమ వాహనాలపై పోలీస్, ప్రెస్ అంటూ స్టిక్కర్లు వేసుకుని తప్పుదావ పట్టిస్తున్నారన్నారు. ఈనేపథ్యంలో ఉన్నతాధికారుల సూచనల మేరకు స్టిక్కర్లు అతికించిన వాహనాలపై ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలీసు డిపార్ట్‌మెంట్‌తోగానీ, జర్నలిస్టులకు గానీ సంబంధం లేకుండా అందుకు సంబంధించిన స్టిక్కర్లు ఎవరైనా వేసుకుంటే వెంటనే తొలగించుకోవాలన్నారు. అలాకాకుండా స్టిక్కరింగ్‌తో వాహనాలు దొరికితే భారీ జరిమానాతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అంతేగాకుండా వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు.

# బయో మైనింగ్‌పై విజిలెన్స్ విచారణ



కంపోస్టు యార్డును పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు (ఫైల్ ఫొటో)

## అర్బన్ ఎమ్మెల్యే ఫిర్యాదుతో చర్యలు ప్రారంభం

## రూ.23 కోట్ల బయో మైనింగ్ టెండర్ రద్దు వెనుక మతలబు

**ప్రజాశక్తి - అనంతపురం కార్పొరేషన్**

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని డంపింగ్ యార్డ్ లో బయోమైనింగ్ ప్రక్రియ చేపట్టేందుకు 23 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టిన ప్రాజెక్టు అవినీతిమయంగా మారిందని అర్బన్ ఎమ్మెల్యే చేసిన ఫిర్యాదు మేరకు విజిలెన్స్ శాఖ దృష్టి సారించింది గడచిన ఏడాది కాలంగా వైసీపీ పాలకవర్గం, టిడిపి అర్బన్ ఎమ్మెల్యే నడుమ జరుగుతున్న వాదోపవాదాలు, విమర్శ ప్రతి విమర్శలు డంపింగ్ యార్డ్ బయో మైనింగ్ ప్రక్రియ అవినీతిపైనే కొనసాగుతూ వచ్చింది. దీనిపై ఏడాదికాలంగా జరిగిన సాధారణ సర్వసభ్య సమావేశాల్లో ప్రధానంగా కంపోస్టు యార్డ్ అవినీతి కంపు పైనే వైసీపీ పాలకవర్గంపై తెలుగుదేశం ఎమ్మెల్యే విమర్శలు గుప్పిస్తూ వస్తున్నారు. దీనిపై కౌన్సిల్ సాధారణ సర్వసభ్య సమావేశంలోనే కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేసి విచారణ జరిపించి అవినీతి నిగ్గు తేల్చాలని ఎమ్మెల్యే పట్టుబడుతుండగా 'అధికారం మీదే.. విచారణ జరిపించండి' అని మేయర్ మరోవైపు సవాలు విసురుతున్నారు అయితే టిడిపి ఎమ్మెల్యే బాధ్యతలు చేపట్టిన తర్వాత జరిగిన కౌన్సిల్ సాధారణ సర్వసభ్య సమావేశంలో ఎక్స్ అఫీషియోగా ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ బయో మైనింగ్ అవినీతి అంశాన్ని లేవనెత్తారు. ఎమ్మెల్యే కోరినట్లుగా కలెక్టర్ నియమించిన విచారణ కమిటీకి జాయింట్ కలెక్టర్ నేతృత్వం వహించినప్పటికీ బదిలీల కారణంగా విచారణ అటకెక్కింది. దీనితో ఏడాది కాలంగా ప్రతినెల ఒకరిపై మరొకరు విమర్శలు గుప్పించుకుంటూ కాలం గడిపారు. తాజాగా ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ లిఖితపూర్వకంగా విజిలెన్స్ శాఖకు ఫిర్యాదు చేయడంతో వారు రంగంలోకి దిగారు. మున్సిపల్ కార్పొరేషన్ లో ఇంజనీరింగ్ అధికారులను కలిసి రికార్డులు అప్పగించాలని కోరారు. తరువాత డంపింగ్ యార్డ్ కు వెళ్లి పరిశీలించారు. రెండేళ్ల క్రితం డంపింగ్ యార్డులో రెండున్నర లక్షల టన్నుల చెత్త చెదారాలు వ్యర్థ పదార్థాలు ఉన్నాయని లెక్క కట్టారు. రూ. 26 కోట్ల టెండర్ను లెస్ రేట్లతో దక్కించుకున్న హైదరాబాద్ కు చెందిన ఇంజనీరింగ్ ఎనర్జీ సొల్యూషన్ కంపెనీ రోజుకు వెయ్యి టన్నుల చెత్త చెదారాన్ని బయో మైనింగ్ చేస్తామని టెండర్ అగ్రిమెంట్ లో స్పష్టంగా పేర్కొంది. అయితే రోజుకు 2వేల టన్నుల చెత్తాచెదారాలను బయో మైనింగ్ చేసినట్లుగా మెజర్మెంట్ బుక్కులో పేర్కొన్న అంశాన్ని ఎగ్జామినర్ గోవిందప్ప అభ్యంతరం తెలిపారు. రెండు కోట్ల రూపాయల బిల్లుల చెల్లింపునకు సంబంధించి అప్పటి అకౌంట్ ఆఫీసర్ పద్మావతి కంపెనీ ప్రతినిధులు ఒత్తిడి మేరకు పంపిన బిల్లులను ఎగ్జామినర్ గోవిందప్ప వివిధ అంశాలపై కొర్రీలు వేస్తూ వాటి వివరణ ఇవ్వాలని సుదీర్ఘమైన లెటర్ పంపారు. దీనితో ఆగమేఘాల మీద అప్పటి అకౌంట్ ఆఫీసర్ పద్మావతి మాతృ శాఖకు బదిలీ చేయించుకుని వెళ్లిపోయారు. సాధారణ సర్వసభ్య సమావేశంలో అప్పటి కమిషనర్ మేఘ స్వరూప్ సమక్షంలో వైసిపి పాలకవర్గం ఎమ్మెల్యే నడుమ అవినీతి అంశంపై పెద్ద ఎత్తున సవాలు ప్రతి సవాళ్లు విసురుకున్నా ఆయన బిల్లును సంతకం చేసే ప్రాసెస్ చేయడం వివాదంగా మారింది. అయితే అనంతర పరిణామాల నేపథ్యంలో ఒక దశలో రెండు కోట్ల రూపాయల బిల్లుల చెల్లింపు ప్రక్రియ ముందుకు సాగిందని ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ ధ్వజమెత్తినా మరోవైపు రెండు కోట్ల రూపాయలు బిల్లు చెల్లింపు ప్రక్రియ ఆగిందని పాలకవర్గం పేర్కొంది. అయితే రెండు కోట్ల రూపాయల బిల్లు చెల్లింపు జరిగిందా లేదా అన్న అంశం పై పెదవి విప్పటానికి అధికార వర్గాలు విముఖత ప్రదర్శించాయి ఈ నేపథ్యంలో 23 కోట్ల రూపాయల బయోమైనింగ్ టెండర్ పై విజిలెన్స్ శాఖ విచారణకు రావడం అధికార యంత్రాంగంలో చర్చకు దారి తీస్తోంది దీని పర్యావసనాలు ఎలా ఉంటాయో అన్న చర్చ సాగుతోంది

## అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు





నృత్యం చేస్తున్న చిన్నారులు

**అనంతపురం :** సంస్కృతి సంప్రదాయాల సమాహారం, శిల్పారామంలో ఆదివారం వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. ఇందులో భాగంగా అనంతపురంలో శక్తి శారీ బ్యాగ్స్ వారి సహకారంతో ఓం సంగీత నృత్య కోలాట శిక్షణా సంస్థ దుగ్రా డ్యాన్స్ అకాడమీ కళాకారులు నృత్య ప్రదర్శనలు చేశారు. కళాకారులు ఎన్.లాస్యశ్రీ, సంజన, వైష్ణవి, టి.అమృత, షణ్ముఖ ప్రియ, ఎం.అనుప్రియ, డి.రేఖ, హరిణి నృత్యాలు చేసినట్లు శిల్పారామం పరిపాలన అధికారి శివప్రసాద్‌రెడ్డి తెలిపారు.

## నీటికుంటలోపడి ఇద్దరు బాలికలు మృతి



శ్వేత (ఫైల్‌ఫొటో)



మౌనిక (ఫైల్‌ఫొటో)

**ప్రజాశక్తి - రాయదుర్గంరూరల్**

మండల పరిధిలోని టి.వీరాపురం గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. స్నేహితుల దినోత్సవం అయిన ఆదివారం ఇద్దరు స్నేహితులు నీటికుంటలో పడి మృతిచెందారు. ఈ ఘటనకు సంబందించి గ్రామస్తులు తెలిపిన వివరాలు.. రాయదుర్గం మండల పరిధిలోని టి. వీరాపురం గ్రామానికి చెందిన పక్కపక్కనే నివాసముంటున్న రెండు కుటుంబాలకు చెందిన శ్వేత(11), మౌనిక(9) అనే ఇద్దరు బాలికలు ఆదివారం ఉదయం ఆడుకునేందుకు తోటలోకి వెళ్తున్నామని ఇంటిలో చెప్పి వెళ్లారు. సమీపంలోని దొణగంగమ్మ ఆలయం వద్ద నీటికుంటలో పడి మృతి చెందారు. ఆదివారం రాత్రి ఆలస్యంగా ఈ విషయం వెలుగులోకి వచ్చింది. పక్కపక్కనే ఉన్న రెండు కుటుంబాలకు చెందిన ఇద్దరు బాలికలు మృతిచెందడంతో వారి కుటుంబసభ్యుల రోదనలు చూపరులను కంటతడి పెట్టించాయి. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# స్వయం పోషక విశ్వవిద్యాలయంగా తీర్చిదిద్దుతాం

## రెండు వేల మార్కు దాటిన విద్యార్థుల సంఖ్య

## జెఎన్‌టియు వైస్ ఛాన్సలర్ హెచ్.సుదర్శన్‌రావు

**ప్రజాశక్తి-అనంతపురం**

అనంతపురం జెఎన్‌టియుని స్వయం పోషక విశ్వవిద్యాలయంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు చేపట్టనున్నట్టు వైస్ ఛాన్సలర్ హెచ్.సుదర్శన్‌రావు పేర్కొన్నారు. అనంతపురం జెఎన్‌టియులో జరుగుతున్న అభివృద్ధి అంశాలపై ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన వివరించారు.





**ప్రశ్న : అనంతపురం జెఎన్‌టియు అభివృద్ధి కార్యక్రమాలు ఏమి నడుస్తున్నాయి. ?**

**జవాబు :** అనంతపురం జెఎన్టీయుని అత్యుత్తమ సాంకేతిక విద్యాలయంగా మార్చేందుకు అవసరమైన అన్ని రకాలు చర్యలు చేపడుతున్నాం.ఇప్పటికే స్వయం పోషక విశ్వవిద్యాలయంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాం. అందులో భాగంగా జెఎన్‌టియు పరిధిలోని కలికిరి, అనంతపురం ,పులివెందుల, ఓటిపిఆర్ఐ కళాశాల్లో అడ్మిషన్ల సంఖ్యను పెంచనున్నాం. నాలుగు క్యాంపస్‌లలో కలిపి మొత్తం 24 వేల మంది విద్యను అభ్యసించేలా మార్పులు తీసుకురావాలన్నది లక్ష్యం. తద్వారా విశ్వవిద్యాలయం స్వయంపోషక విశ్వ విద్యాలయంగా మార్చేందుకు కృషి చేస్తాం.

**ప్ర : కొత్తగా మరో కళాశాల జెఎన్‌టియు పరిధిలోకి చేరనుందా ?**

**జ :** చిత్తూరు జిల్లాలోని కళాహస్తిలో ఎండోమెంట్ పరిధిలోనున్న ఇంజనీరింగు కళాశాలను కూడా అనంతపురం జెఎన్‌టియు పరిధిలోకి తీసుకొచ్చే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వముంది. ఇప్పటికే అటువంటి ప్రక్రియ ప్రారంభమైంది. అధికారిక ఉత్తర్వులు ఇంకా రావాల్సి ఉంది. ఈ ఏడాది కౌన్సిలింగులోనే ఆ మార్పు కనిపిస్తోంది. జెఎన్‌టియు అనంతపురం పరిధిలోకి ఈ ఏడాది కొత్త కళాశాల రాబోతోంది.

**ప్ర: విశ్వవిద్యాలయం పరిధిలో ప్లేస్‌మెంట్స్ పెంచేందుకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?**

**జ :** ప్రతి ఇంటిలో ఒక పారిశ్రామికవేత్త తయారు కావాలన్నది ప్రభుత్వ లక్ష్యంగా ఉంది. ఆ దిశగానే సాంకేతిక విద్యను అందివ్వడంతోపాటు నైపుణ్యం పెంచేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు నడుస్తున్నాయి. ఇవే కాకుండా కియా, జెఎస్‌డబ్లు సంస్థలతో ఒప్పందాలు జరిగాయి. మరికొన్ని సంస్థలతో ఒప్పందాల కోసం ప్రయత్నాలు చేస్తున్నాం.

**ప్ర: మౌళిక సదుపాయల కల్పనకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?**

**జ :** మౌళిక సదుపాయల మెరుగుదలపైనా దృష్టి సారించాం. ఓటిటిఆర్ఐలో నడుస్తున్న ఫార్మసీ కళాశాలకు ఇప్పటి వరకు పాత భవనంలో ఉంది. అక్కడ రూ.20 కోట్లతో నూతన భవన నిర్మాణంతోపాటు హాస్టల్ వసతి కల్పించే ఏర్పాట్లు జరుగుతున్నాయి. పులివెందులలోనూ రూ.25 కోట్లతో నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇప్పటి వరకు కేంద్రీయ విశ్వవిద్యాలయానికి తాత్కాలిక భవనం కింద ఇచ్చిన భవనాన్ని ఈ ఏడాది స్వాధీనం చేసుకోనున్నాం. అక్కడ ఎంబిఎ కళాశాలను ఏర్పాటు చేయనున్నాం.

**ప్ర: పరిశోధనలు ఏ విధంగా నడుస్తున్నాయి ?**

**జ :** పరిశోధనలపైనా ప్రత్యేకంగా దృష్టి పెట్టాం. ఆయా విభాగాలన్నింటికీ అధ్యాపకులకు పరిశోధనల కోసం గ్రాంటు కేటాయించియున్నాం. మొత్తంగా పరిశోధనల కోసం వివిధ సంస్థల నుంచి ఏడు కోట్ల రూపాయల వరకు నిధులు అందుబాటులో ఉన్నాయి. వాటి ద్వారా అవి నడుస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవతో ఏర్పాటు చేస్తున్న రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లో విశ్వవిద్యాలయం నాలెడ్జ్ పార్టినర్‌గా ఉంటుంది.



జెఎన్‌టియు విసి సుదర్శనరావు

ప్రజాశక్తి
www.prajasakti.com





కార్యక్రమంలో మాట్లాడుతున్న గ్రామ, వార్డు సచివాలయ విద్యుత్తు ఉద్యోగుల సంఘం నాయకులు

## విద్యుత్ బోర్డు నియమాలు అమలు చేయాల్సిందే..

**ప్రజాశక్తి-గుత్తి**

జూనియర్ లైన్‌మెన్ల (గ్రేడ్ 2)కు ఏపి రాష్ట్ర విద్యుత్ బోర్డు సేవా నియమాలను అమలు చేయాల్సిందేనని గ్రామ, వార్డు సచివాలయ విద్యుత్తు ఉద్యోగుల సంఘం–5 రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.మల్లికార్జునరెడ్డి, జిల్లా కన్వీనర్ వెంకటేష్‌నాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని వసుధ ఫంక్షన్ హాల్‌లో డివిజన్ స్థాయి సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో విధులు నిర్వహిస్తున్న జూనియర్ లైన్‌మెన్ (గ్రేడ్–2)కు నూతన సేవా విధానాన్ని రద్దు చేయాలన్నారు. జెఎల్ఎం గ్రేడ్–2 సమస్యలను పరిష్కరించాలని పలుమార్లు ప్రభుత్వం, విద్యుత్ యాజమాన్య దృష్టికి తీసుకెళ్లిన ప్రయోజనం లేదన్నారు. విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు రాష్ట్రంలో దాదాపు 120 మంది జేఎల్ఎం గ్రేడ్ 2లు ప్రాణాలు కోల్పోయారన్నారు. ప్రమాదాలకు గురై చాలామంది అంగవైకల్యం చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం, విద్యుత్ సంస్థ యజమాన్యం స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం నూతన డివిజన్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. డివిజన్ అధ్యక్షుడిగా యాదవ సురేష్, ప్రధాన కార్యదర్శి నాగరాజు, వర్కింగ్ అధ్యక్షులు భాస్కర్ నాయక్, శరత్, కోశాధికారి ప్రవీణ్, ఉపాధ్యక్షులు మహమ్మద్, ఖాదర్‌బాషా, విజయ్, సహాయ కార్యదర్శులు శంకర్, సంతోష్, ధనుంజయ, వరుణ రామ్‌నాయక్, కార్యవర్గ సభ్యులుగా రామాంజనేయులు, మహేష్, రఘు, సలీం, హరిగోపాల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## యూరియా కొరత తీర్చాలి

### ఎపి రైతు సంఘం తాలూకా ప్రధాన కార్యదర్శి తిప్పేస్వామి

**ప్రజాశక్తి-రాయదుర్గం**



విలేకరులతో మాట్లాడుతున్న ఎపి రైతు సంఘం తాలూకా ప్రధాన కార్యదర్శి తిప్పేస్వామి

రైతులకు యూరియా కొరత తీర్చాలని ఎపి రైతుసంఘం రాయదుర్గం తాలూకా ప్రధాన కార్యదర్శి తిప్పేస్వామి డిమాండ్ చేశారు. ఆదివారం రాయదుర్గంలో విలేకరులతో మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాలు, గ్రామ సొసైటీల్లో ఉన్న యూరియాను అధికారులు తమకు అనుకూలమైన వారికే అందజేస్తున్నారని ఆరోపించారు. రైతులకు ఎరువులు పంపిణీ చేయడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. సరైన సమయంలో రైతులకు ఎరువులు పంపిణీ చేయకపోతే తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. కావున వెంటనే ప్రభుత్వం స్పందించి రైతులకు యూరియాతోపాటు ఎరువులను అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గంగాధర్, నాగయ్య, మాధవ్, తదితరులు పాల్గొన్నారు.

## గడప గడపకూ 'మోసం గ్యారెంటీ'



కరపత్రాలు పంపిణీ చేస్తున్న వైసిపి నాయకులు

**పుట్లూరు :** మండల పరిధిలోని కొండేపల్లి, ఎస్.గూడూరు గ్రామాల్లో వైసిపి మండల కన్వీనర్ పొన్నపాటి మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం 'బాబు షూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వైసిపి నాయకులు ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలపై క్యూఆర్ కోడ్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు రమాదేవి, జనార్దన్‌నాయుడు, రామకృష్ణారెడ్డి, వైస్ సర్పంచు జయరామ్‌రెడ్డి, నాయకులు నాగేశ్వర్‌రెడ్డి, రమణారెడ్డి, శివారెడ్డి, మద్దిలేటిరెడ్డి, మోహన్, శివ, విష్ణువర్ధన్, నారాయణస్వామి, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 'తొలి అడుగు'లో వినతికి పరిష్కారం

**యాడికి :** ఇటీవల నిర్వహించిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో విన్నవించిన సమస్యలకు టిడిపి నాయకులు ఆదివారం పరిష్కారం చూపారు. మండల కేంద్రంలోని కాలనీలో స్పీడ్‌బ్రేకర్లతోపాటు కాలనీలోని పలు సమస్యలను విన్నవించారు. ఇందుకు స్పందించిన స్పందించిన జేసీ అభిమాని విశ్వనాథ్ మిత్ర బృందం మూడు చోట్ల స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేశారు. అదేవిధంగా కాలువను శుభ్రం చేసి, చిన్న చిన్న సమస్యను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వెలిగండ్ల ఆదినారాయణ, తిరంపురం నీలకంఠ, రామచంద్ర, సుభాన్, గుండా నారాయణస్వామి, వెంకటస్వామి, గన్నే రమేష్, పోలా రామాంజినేయులు, క్లస్టర్ ఇన్‌ఛార్జి మాయకుంట్ల నారాయణస్వామి, పూలతోట రవి, రహంతుల్లా, చాంద్‌బాషా, తిరుమలేష్, శివ, చందు, కరీం, మేకల రామాంజి, రమణ, లలూ, తదితరులు పాల్గొన్నారు.

## మహాసభలు జయప్రదం చేయండి

**గుంతకల్లు :** పట్టణంలో ఈనెల 9, 10వ తేదీల్లో నిర్వహించనున్న సిపిఐ పట్టణ మహాసభలను జయప్రదం చేయాలని ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.జగదీష్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి సిపిఐ గ్రామస్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు మహాసభలు జరుపుకుంటుందన్నారు. ఈ మహాసభల్లో వివిధ రాజకీయ విధానాలు రూపొందించుకుని నూతన నాయకత్వాన్ని ఎన్నుకోనున్నట్లు తెలిపారు. కావున మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు బి.గోవిందు, వీరభద్ర స్వామి, బి.మహేష్, ఎస్.గోపీనాథ్, ఎస్ఎండి గౌస్, రాము రాయల్, తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు అన్నదానం



అన్నదానం చేస్తున్న దృశ్యం

**అనంతపురం :** నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు, పుట్టినిల్లు ఆశ్రమం ఛైర్‌పర్సన్ ఎస్.నిర్మలమురళి ఆధ్వర్యంలో ఆదివారం ఆదర్శనగర్‌లోని పుట్టినిల్లు ఆశ్రమం వద్ద పేదలకు అన్నదానం చేశారు. ట్రస్టు సభ్యులు శివ రాజాప్రసాద్, సతీమణి శశికళ కుమార్తె, శారద బుక్‌స్టాల్ యజమాని శివరాజు ప్రసాద్ పుట్టినరోజు సందర్భంగా అన్నదానానికి సహకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు గాయత్రి, మణిదీప్, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి సంఘాలపై నిషేధం దుర్మార్గం

**అనంతపురం :** పాఠశాలల్లో విద్యార్థి సంఘాలు, రాజకీయ పార్టీలు ప్రవేశించకుండా నిషేధిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం అణదొక్కడమే అని ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి హనుమంతురాయుడు, కుళ్లాయిస్వామి అన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులను నిరసిస్తూ ఆదివారం నగరంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట ఉత్తర్వులను దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ నగర అధ్యక్షులు మంజునాథ్, నగర కోశాధికారి నాని, సహాయ కార్యదర్శి సమీర్, నాయకులు తరుణ్, కార్తీక్, యశ్వంత్, అక్బర్, సురేష్, యశ్వంత్, ఉమేష్, భీమేష్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ హాస్టళ్లలో మెనూ పాటించాలి

**ప్రజాశక్తి-ఆత్మకూరు**

ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లలో మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని హరిత దివ్యాంగుల సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు బి.మోహన్ నాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఎస్టీ ఎస్సీ. హాస్టల్లో ఆవరణలో విద్యార్థులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్టీ, ఎస్సీ హాస్టల్లో మెనూ ప్రకారం భోజనం అందించడం లేదన్నారు. గుడ్లు, అరటిపండు, చికెన్ ఇవ్వడం లేదన్నారు. దీనికితోడు ఎక్కడా శుభ్రత పాటించడం లేదని ఆరోపించారు. అలాగే హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఆయా సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో మణికంఠ, చంద్రశేఖర్, భాస్కర్‌రెడ్డి, మనోజ్‌కుమార్, గోవర్ధన్, చంద్రశేఖర్ యాదవ్, గోపీనాథ్, హర్షవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న హరిత దివ్యాంగుల సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు బి.మోహన్‌నాయక్

## భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

### సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర

**ప్రజాశక్తి-గుంతకల్లు**




మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర

ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక హంపిరెడ్డి భవనంలో భవన నిర్మాణ కార్మికుల యూనియన్ 7వ జిల్లా మహాసభలను నిర్వహించారు. ఇందులో భాగంగా గడిచిన మూడేళ్లలో చేసిన ఉద్యమాలను సమీక్షించి రాబోయే మూడేళ్లపాటు చేయనున్న ఉద్యమాల కార్యాచరణపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని కుటుంబ ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ముఖ్యంగా కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలని, పెండింగ్ క్లైముల పరిహారాలను చెల్లించాలన్నారు. అదేవిధంగా 2020 సెప్టెంబర్ నుండి జరిగిన వివాహాలు, ప్రసవాలు, సహజ, ప్రమాద మరణాలకు నిలుపుదల చేసిన పరిహారాన్ని సంక్షేమ బోర్డు ద్వారా చెల్లించాలన్నారు. స్టీల్, సిమెంట్ ధరలు తగ్గించాలని, ఉచితంగా ఇసుక అందించాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యల పరిష్కారానికి రానున్న రోజుల్లో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం యూనియన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షునిగా ప్రసాద్, కార్యదర్శిగా రామాంజనేయులు, కోశాధికారిగా వేణుతోపాటు 10మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ ప్రధాన కార్యదర్శి సాకే నాగరాజు, అధ్యక్షులు జగదీష్, జిల్లా నాయకులు వెంకటనారాయణ, మారుతీప్రసాద్, జాకీర్, ఉమాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ భారాలను ఉపసంహరించుకోవాలి

### సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.మల్లికార్జున

**ప్రజాశక్తి-రాయదుర్గం**




విలేకరులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

విద్యుత్ ఛార్జీల పెంపుతోపాటు ట్రూఅప్, ఇంధన సర్దుబాటు ఛార్జీల విధానాన్ని రద్దు చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.మల్లికార్జున డిమాండ్ చేశారు. ఆదివారం పార్టీ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలను పెంచబోమని చెప్పి, అధికారంలోకి రాగానే ఇచ్చిన మాటను తప్పి ప్రజలపై విపరీతమైన విద్యుత్ భారాలు మోపుతోందన్నారు. ట్రూఅప్ ఛార్జీల పేరుతో రూ.12,771 కోట్ల భారాన్ని ప్రజలపై మోపిందన్నారు. తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇకపోతే కూటమి నాయకులు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లను పగులగొట్టండని పిలుపునిచ్చి అధికారంలోకి రాగానే స్మార్ట్ మీటర్ల బిగింపునకు పూనుకోవడం బాధాకరమన్నారు. కార్పొరేట్ కంపెనీలతో అక్రమ ఒప్పందాలు, అవినీతి చర్యలతో అడ్డగోలుగా వ్యయం పెంచి ఆ భారాన్ని వినియోగదారులపై వేయడం సమంజసం కాదన్నారు. కూటమి ప్రభుత్వం తక్షణమే స్పందించి విద్యుత్ ఛార్జీల పెంపు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును తక్షణమే ఉపసంహరించుకోవాలన్నారు. లేనిపక్షంలో ఈనెల 5న వామపక్షాల ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం పట్టణ అధ్యక్షులు మధు, భవన నిర్మాణ కార్మిక సంఘం పట్టణ అధ్యక్షులు తిమ్మరాజు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు శివ, నాయకులు ఓబులేష్, అంజి, వెంకటేశులు, రామాంజి, తదితరులు పాల్గొన్నారు.

## నిబద్ధత విమర్శకుడు కల్లూరి ఆనందరావు

### 'ఆలోకనం' పుస్తకావిష్కరణలో వక్తలు

**ప్రజాశక్తి-అనంతపురం**



'ఆలోకనమ్' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వక్తలు

సాహిత్యంలో నిబద్ధతమైన విమర్శలు కల్లూరి ఆనందరావు అని పలువురు వక్తలు కొనియాడారు. కల్లూరి ఆనంద్‌రావు రచించిన 'ఆలోకనం' పుస్తకాన్ని ఆదివారం నగరంలోని ఎన్‌జిఒ హోంలో విమలా శాంతి సాహిత్య సాంస్కృతిక సేవా సమితి, కళాజోష్ణ సంస్థలు సంయుక్తంగా డాక్టర్ శాంతి నారాయణ అధ్యక్షతన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుస్తకావిష్కరణ కర్తగా పాల్గొన్న కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ విమర్శకు రాయలసీమ ప్రధాన భూమిక పోషించిందన్నారు. సమాజం సాహిత్యం సాహిత్య విమర్శ ఇవి విమర్శకు త్రయాలు అన్నారు. డాక్టర్ కల్లూరి ఆనందరావు ఆలోకనమ్ విమర్శ గ్రంథంలో దళిత బహుజన సాహిత్య విమర్శ చాలా లోతుగా కనిపిస్తుందని కొనియాడారు. సిపి బ్రౌన్ వేమన సాహిత్యాన్ని వెలుగులోకి తీసుకురావడమే కాకుండా తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశారని కొనియాడారు. విమర్శకుడు అహంకారిగా ఉండకూడదు అంటూ వర్ధమాన విమర్శకులకు సూచన చేశారు. పుస్తక రచయిత, విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ కల్లూరి ఆనందరావు ప్రసంగిస్తూ, మహాకవి గుర్రం జాషువా, బోయి భీమన్న, ఆచార్య కొలకలూరి ఇనాక్ నాకు సాహిత్య గురువులని వారి రచనలు ఎంతో ప్రేరణనిచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ రొటేరియన్ పి.కేశవరెడ్డి, అనంతపురం సెంట్రల్ రోటరీ క్లబ్ అధ్యక్షుడు గల్లా హర్ష, డాక్టర్ పామిరెడ్డి దామోదర్‌రెడ్డి, డాక్టర్ నందిరాజు కళ్యాణి, డాక్టర్ జింక లక్ష్మీనారాయణ, కుమార్,కథా రచయిత ఉప్పరపాటి వెంకటేశులు, జి.రంగనాయకులు, ఎస్‌కెయు తెలుగు శాఖ అకడమిక్ కన్సల్టెంట్ నానీల నాగేంద్ర, కల్లూరి యశస్వి, అంకె శ్రీనివాసులు, యోగేశ్వరనాయుడు, జూటూరి షరీఫ్, టీవీ రెడ్డి, చెట్ల ఈరన్న, ప్రకాష్ బాబు, కల్లూరి ఆనందరావు కుటుంబ సభ్యులు నందిరాజు కళ్యాణి, కల్లూరి యశస్వి, తదితరులు పాల్గొన్నారు.

## సింగిల్‌విండో ప్రెసిడెంట్ ప్రమాణస్వీకారం

**ప్రజాశక్తి-పామిడి**




గుమ్మనూర్ ఈశ్వర్‌కు గజమాలతో స్వాగతం పలుకుతున్న టిడిపి నాయకులు

స్థానిక రహమత్ ఫంక్షన్ హాల్‌లో పి.కొత్తపల్లి సింగిల్‌విండో ఛైర్మన్‌గా బొల్లు శ్రీనివాసరెడ్డి, డైరెక్టర్ వడ్డే పద్మావతి, నల్ల ఖాదర్‌బాషా ఆదివారం ప్రమాణస్వీకారం చేశారు. ముందుగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల ఇన్‌ఛార్జి గుమ్మనూరు ఈశ్వర్‌కు మండల కేంద్రంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద భారీ గజమాలతో స్వాగతం పలికారు. అక్కడి నుంచి అంబేద్కర్ సర్కిల్ మీదుగా ఫంక్షన్‌హాల్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా గుమ్మనూరు ఈశ్వర్ మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడే నాయకులు, కార్యకర్తలకు తగిన ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. బొల్లు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ తన పరిధిలోని సహకార సంఘం అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు వెంకటశివుడు యాదవ్, ఎడిసిసి బ్యాంకు ఛైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, గుత్తి మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ కత్రిమల ప్రభాకర్‌చౌదరి, నాయకులు జింకల సంజీవకుమార్, గౌస్‌పీరా, బొమ్మ మోహన్, సురేష్‌రెడ్డి, నల్లబోతుల శీన, శ్రీరాములు, అప్పన్నగారి కుమార్, సుంకప్ప, తిమ్మప్ప, సంజీవ, ధనుంజయ, సుబ్బు, రాము, షేక్షావలి, బిజెపి మండలాధ్యక్షుడు అంజి నాయక్, లక్ష్మీదేవి, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల ఆర్థిక పురోగతికి చేయూత

### అర్బన్‌బ్యాంకు ఛైర్మన్ జెఎల్. మురళీధర్

**ప్రజాశక్తి-అనంతపురం**



ఎడిసిసి బ్యాంకు ఛైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డిని సన్మానిస్తున్న అతిథులు

అనంతపురం అర్బన్ బ్యాంక్ ద్వారా ప్రజల ఆర్థిక పురోగతికి చేయూతనిస్తున్నామని బ్యాంకు ఛైర్మన్ జెఎల్ మురళీధర్ అన్నారు. ఆదివారం నగరంలోని సుభాష్ రోడ్డులో ఉన్న శ్రీకృష్ణదేవరాయ భవన్‌లో అనంతపురం కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు 109వ మహాజన సభను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎడిసిసి బ్యాంకు ఛైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, డిసిఎంఎస్ ఛైర్మన్ ఎన్.వెంకటేష్, జిల్లా కో–ఆపరేటివ్ అధికారిణి అరుణ్‌కుమారితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మురళీధర్ మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలు బ్యాంకింగ్ సేవలను వినియోగించుకోవడానికి అత్యంత చేరువుగా అర్బన్ బ్యాంక్ కార్యకలాపాలు కొనసాగిస్తున్నామన్నారు. ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించేందుకు త్వరలోనే నెఫ్ట్, ఆర్టిజిఎస్ తోపాటు ఎటిఎం కార్డు సదుపాయాలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సీఈఓ ఎం.విజయభాస్కర్, వైస్ ఛైర్మన్‌లు వడ్డే సుబ్రమణ్యం, ఎం.చంద్రశేఖర్, బ్యాంకు డైరెక్టర్లు సుంకర రమేష్, పి.కృష్ణకుమార్, బి.రమణయ్య, గోల్డ్ బాషా, రోళ్ల భాస్కర్, జె.రామాంజనేయులు, ఎల్.అనిల్‌నాయుడు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న టిడిపి నేతలు

**గుత్తి :** మండలంలోని తురకపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీలో మరణించిన పూజారి లక్ష్మీదేవి కుటుంబానికి టిడిపి నాయకుడు కనికిరెడ్డిగారి విజయ్ భారత్‌రెడ్డి ఆదివారం రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బోయ శంకర్, నారాయణస్వామి, నాగేశ్వరరెడ్డి, స్టోర్ డీలర్ లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్య పరిష్కారం

**ప్రజాశక్తి-యాడికి**

మండల పరిధిలో రాయలచెరువు గ్రామంలో ఎన్టీఆర్ కాలనీ, కొత్త కొట్టాలు కాలనీ, హై స్కూల్ కాలనీల్లో నెలకొన్న తాగునీటి సమస్యను మాజీ ఎంపిపి వేలూరు రంగయ్య ఆదివారం పరిష్కరించారు. కొద్దిరోజుల నుంచి తాగునీటి సమస్య ఉందని కాలనీవాసులు రంగయ్య దృష్టికి తీసుకురావడంతో స్పందించి ట్యాంకర్లు ఏర్పాటు చేసి తాగునీటి సమస్య పరిష్కరించారు.

## అన్నదానం



అనాథ పిల్లలతో కలిసి భోజనం చేస్తున్న రాజు

**పుట్లూరు :** ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని టిడిపి నాయకులు కడవకల్లు గ్రామానికి చెందిన గోవర్ధనరాజు ఆధ్వర్యంలో ఆదివారం మండల పరిధిలోని భగవాన్ రమణమహర్షి అనాథాశ్రమంలో అన్నదానం చేశారు. జనం మెచ్చిన ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పుట్టిన రోజు సందర్భంగా అనాథాశ్రమంలో దాదాపు 130మంది అనాథ పిల్లలకు అన్నదానం చేసినట్లు గోవర్ధన రాజు తెలిపారు.

## టిడిపి నాయకుడికి పరామర్శ

**యాడికి :** అనారోగ్యంతో బాధపడుతూ ఇంటి వద్ద ఉన్న మండల కేంద్రంలోని మార్కెట్ వీధిలో నివాసం ఉంటున్న టిడిపి సీనియర్ నాయకులు మందాటి దేవేంద్రనాయుడును మాజీ ఎంపిపి వేలూరు రంగయ్య, టిడిపి మండల కన్వీనర్ రుద్రమనాయుడు, తదితరులు ఆదివారం పరామర్శించారు. దేవేంద్రనాయుడు ఇటీవల మోకాలికి శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటిదగ్గర విశ్రాంతి తీసుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు ఆయన ఇంటికి ఆదివారం వెళ్లి పరామర్శించి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో టిడిపి నాయకులు రవి కుమార్‌రెడ్డి, వెలిగండ్ల ఆదినారాయణ, రవికుమార్‌రెడ్డి, దడియాల ఆది, పరిమి శ్రీహరి, నెట్టికంటయ్య, మాజీ సర్పంచు గోపాల్‌నాయుడు, రహంతుల్లా, తదితరులు ఉన్నారు.

## ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న ఓబుళపతి

**శింగనమల :** రోడ్డు ప్రమాదానికి గురై కర్నూలులో చికిత్స పొందుతున్న మండల పరిధిలోని గురుగుంట్ల గ్రామానికి చెందిన ఓబుళపతికి నాగులగుడ్డం దాసరి వెంకటరమణ ఆదివారం ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు వరికుటి లక్ష్మన్న, శివ, ఉల్లికల్లు పవన్‌కుమార్, నాగులగుడం లక్ష్మణ, నాగభూషణం, నల్లప్ప, తిరుపాలు, ఎకె భూషణ, తదితరులు పాల్గొన్నారు.

## రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న యువకులు

**పామిడి :** మండలంలోని కొండాపురం గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద పామిడి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థ సహకారంతో ఆదివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా దాదాపు 23 మంది యువకులు రక్తదానం చేశారు. ఈకార్యక్రమంలో లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు, ప్రభుత్వ ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ నల్లపాటి తిరుపతినాయుడు, రెడ్‌క్రాస్ వైద్యాధికారి డాక్టర్ నిఖిల్, రెడ్‌క్రాస్ సంస్థ సభ్యులు ఆలంబన్ జనార్ధన్, జీవన్‌కుమార్, మూర్తి, హరికృష్ణ, స్టాఫ్‌నర్స్ సరళ, పామిడి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రఘువీర్, జయరామ్‌రావు, ప్రధాన కార్యదర్శి పత్రా శ్రీనివాసులు, షేక్షావలి, ముండే షేక్షావలి, డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ శాంతి ప్రియ, సర్వేస్, మహేష్, గంగ శేఖర్, తూర్పుంటి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## వ్యాసరచన పోటీలు




వ్యాసరచన పోటీలు నిర్వహించిన లయన్స్ సభ్యులు

**తాడిపత్రి :** పట్టణంలోని పద్మావతి ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ తాడిపత్రి, మహిళల ఆధ్వర్యంలో ఆదివారం 'సెల్‌ఫోన్ వ్యసనం, ప్రభావాలు' అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో 375 మంది పాల్గొనగా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

## కమ్యూనిస్టులతోనే సమస్యలకు పరిష్కారం




ర్యాలీ నిర్వహిస్తున్న సిపిఐ నాయకులు

**తాడిపత్రి :** కమ్యూనిస్టుల ఉద్యమాల ద్వారానే ప్రజా సమస్యల పరిష్కారం సాధ్యమని సిపిఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాజారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని బుగ్గ రామలింగేశ్వర స్వామి వద్ద ఉన్న రజక ఫంక్షన్ హాల్లో సిపిఐ 16వ నియోజకవర్గ మహాసభలు నిర్వహించారు. ముందుగా పోలీస్‌స్టేషన్ సర్కిల్ నుంచి ఫంక్షన్ హాల్ వరకూ ఎర్రజెండాలు చేత పట్టుకుని ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు వెంకట్ రాముడు యాదవ్, చిరంజీవియాదవ్, చింతా పురుషోత్తం, నాగరంగయ్య, మహమ్మద్ రఫీ, రైతు సంఘం నాయకులు వీటి రామాంజనేయులు, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

## నేరాలు ఘోరాలు

### యువకుడు ఆత్మహత్య



హర్ష (పాతచిత్రం)

**నార్పల :** మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురుగా నివాసం ఉంటున్న ఆది కుమారుడు హర్ష (25) ఆదివారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఇంట్లో వివాహం చేసుకోవాలని ఒత్తిడి తీసుకురావడంతో మనస్థాపం చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుని తండ్రి ఆదినారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాగర్ తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



బసవరాజు (పాతచిత్రం)

**రాయదుర్గం రూరల్ :** రాయదుర్గం–అనంతపురం జాతీయ రహదారిలోని కాశీపురం క్రాస్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వొడాఫోన్ కేబుల్ నెట్‌వర్క్ ఇంజినీర్ బసవరాజు (40) మృతిచెందాడు. డ్రైవర్ కమల్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. వోడాఫోన్ లగేజ్ వాహనం రాయదుర్గం వైపు వస్తుండగా అదుపుతప్పి బోల్తాపడగా బసవరాజు అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలిపారు. మృతుడు శెట్టూరు మండలం మాలేపల్లికి చెందిన బసవరాజుగా స్థానికులు గుర్తించారు. డ్రైవర్ అతివేగంగా వాహనం నడపడంతోనే ప్రమాదం జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. రాయదుర్గం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాగా విషయం తెలుసుకున్న మృతుడు బసవరాజు కుటుంబ సభ్యులు, బంధువులు ఘటనా స్థలానికి చేరుకుని రాయదుర్గం – అనంతపురం జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. కంపెనీ తరపున మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలని రోడ్డుపై బైఠాయించారు. విషయం తెలుసుకున్న ఎస్ ప్రసాద్ ఘటనా స్థలానికి చేరుకుని సర్దిచెప్పి ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా చేశారు.

### మద్యం దుకాణంలో చోరీ

**గుత్తి :** మున్సిపాలిటీ పరిధిలోని ఆర్ఎస్ ప్రధాన రహదారిలో ఉన్న భవాని బ్రాందీ షాపులో శనివారం రాత్రి చోరీ జరిగింది. దుండగుడు మద్యం దుకాణ భవనం వెనుక వైపున కన్నం వేసి లోనికి ప్రవేశించాడు. క్యాష్ బాక్స్‌లో ఉన్న రూ.30 వేల నగదు, ఖరీదైన మద్యం బాటిళ్లను అపహరించుకెళ్లాడు. ఘటనపై మద్యం దుకాణం నిర్వాహకులు పోలీసులు ఫిర్యాదు చేశారు. పోలీసులు దుకాణాన్ని పరిశీలించారు. క్లూస్ టీం సభ్యులు వేలిముద్రలను సేకరించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.